వలంటీర్ల సేవలు అద్భుతం

- పచ్చ పత్రికల వార్తలు అవాస్తవం
- ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: రాష్ట్రంలో ఉన్న 2.60 లక్షల మంది వలంటీర్లు అర్హులైన పేదల ఇళ్లకు వెళ్లి అందిస్తున్న సేవలు అద్భుతమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఇటీవల ఈనాడు, ఈ టీవీలో వలంటీర్లను కించపరిచేలా వస్తున్న కథనాలపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎటువంటి స్వార్థం లేకుండా కుల, మత, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ వారి ఇంటికి వెళ్లి పథకాలను వివరిస్తూ సచివాలయాలకు తీసుకెళ్ళి అప్‌లెయ్ చేయించి, ఇంటి వద్దకే పథకాలను అమలు చేస్తోంది వలంటీర్‌లేనన్నారు. వలంటీర్ వ్యవస్థపై పచ్చ పత్రికలు అసత్య కథనాలు రాయడంపై ఎమ్మెల్యే కేపీ ఖండించారు. ‘రోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇంటింటికి వెళ్ళి 1వ తేదీ పింఛన్‌తో పాటు అన్ని రకాల సేవలను, సర్వేలను, చేసిన విషయాన్ని అంతా గుర్తు చేసుకోవాలన్నారు. వలంటీర్‌ల సేవలు పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ అందుతున్నాయన్నారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, పొదిలి మాజీ ఎంపీపీ నరసింహారావు, పార్టీ నాయకులు ఉత్తమ్ కుమార్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, శివారెడ్డి, బుదాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

ప్రతి విషయాన్ని రాజకీయం చేయవద్దు

మార్కాపురం టౌన్: నియోజకవర్గంలో ఇటీవల జరుగుతున్న వివిధ విషయాల్లో తనతో పాటు పార్టీకి కూడా అపార్థాలను జోడిస్తున్నారని, ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మండలంలోని భూపతిపల్లి సచివాలయంలో ఒక వ్యక్తి తన తల్లికి పింఛన్ రాలేదని సచివాలయానికి వెళ్ళి ప్రశ్నిస్తే ఆ వ్యక్తి సచివాలయ సిబ్బందితో తాను ఎమ్మెల్యే బంధువునని బెదిరింపు ధోరణితో మాట్లాడినట్లుగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టడం మంచిది కాదన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే!

పొదిలి రూరల్: ఎన్నికల ముందు పాదయాత్ర లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం పొదిలి నగర పంచాయతీ సచివాలయం-1,2 పరిధిలోని 5,6 వార్డులో ఎంఆర్వో ఆఫీస్ వీధి, తూర్పుపాలెం, నేతపాలెం, దాసరిగడ్డ వీధిలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు నిర్వహించారు. కమిషనర్ డానియల్ జోసఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టరు మారుతీరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ,కసిరెడ్డి రమణారెడ్డి, ఎస్.కె నూర్జహాన్ బేగం,, గొలమారి చెన్నారెడ్డి, జి. శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, కె. నరసింహారావు, వర్షం ఫిరోజ్, కొత్తపులి బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులు, మల్లాపురం నరసింహులు, పొదిలి రాంబాబు, పి. భాను, గురునాథం, రామారావు, బందీసాహెబ్, హసన్‌వలి, జాకీర్, గూడూరి వినోద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ముండ్లమూరు: మండలంలోని పోలవరంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు శనివారం పరిశీలించారు. గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న పనులను ఎంపీడీఓ కుసుమకుమారితో కలిసి ఆయన పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేయించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, నాయకులు నెమలిదిన్నె సుబ్బారెడ్డి ఉన్నారు.

శ్రీవారికి పూజలు

కొనకనమిట్ల: వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మౌని అమావాస్య సందర్భంగా శనివారం పూజలు నిర్వహించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాశినాయన జయంతి వేడుకలు

గిద్దలూరు రూరల్: అవధూత కాశినాయన 131 వ జయంతి సందర్భంగా ముండ్లపాడు రోడ్డులో గల కాశినాయన ఆలయంలో జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. చిన్నసుబ్బారావు స్వామీజీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బి.ఎస్.నారాయణరెడ్డి, కాశినాయన జీవిత చరిత్ర గురించి వివరించారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశినాయన నగర్‌లోని గాయత్రిమాత ఆలయం ఆవరణలో అమావాస్య సందర్భంగా శనివారం భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో గాయత్రి యజ్ఞం నిర్వహించారు. బి.ఎస్.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

పొదిలి రూరల్: విశ్వనాథపురంలోని పింఛనర్ల భవనంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బాదుల్లా తెలిపారు. వినుకొండ వెన్నెల నేత్రాలయం-ఫెకో, లేజర్ సెంటర్ డాక్టర్ దస్తగిరి పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

మార్కాపురం డిపోకు రూ. 21 లక్షల ఆదాయం

మార్కాపురం: సంక్రాంతి సందర్భంగా ఈనెల 11 నుంచి 18 వరకు మార్కాపురం డిపోకు 21,88,239 రూపాయల ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ ఎ.ఎస్ నరసింహులు శనివారం తెలిపారు. ఆర్టీసీని ఆదరిస్తున్న ప్రయాణికులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ హామీలు నెరవేర్చండి

మార్కాపురం టౌన్: పాత పెన్షన్ పునరుద్ధరిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.బాబురెడ్డి కోరారు. శనివారం మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓవీ వీరారెడ్డి, బి.శ్రీరాములు, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్, ఎర్రయ్య, దండా వెంకటరెడ్డి ఉన్నారు.

మల్లవరంలో పొలంబడి

పొదిలి రూరల్: మండలంలో శనివారం వ్యవసాయాధికారులు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ షేక్ జైన్‌లుద్దీన్ మాట్లాడుతూ కందిలో వెర్రి తెగులు ఎక్కువగా ఉందని తెలిపారు. మాజీ ఎంపీపీ యర్రమూడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ రెడ్డెబోయిన సుబ్బయ్య, రెడ్డెబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌ల పంపిణీ

మార్కాపురం టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని జెడ్పీడ పాఠశాలలో చదువుతున్న 300 మంది 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందించటం అభినందనీయమని హెచ్ఎం చంద్రశేఖర రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. పంబి వెంకటరెడ్డి, ఎంఎస్ రెడ్డి, ధర్మానాయక్, గురవయ్య, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ దాటాలంటే హెల్మెట్ ధరించాలి

తర్లుపాడు: టోల్‌గేట్ దాటాలంటే కచ్చితంగా హెల్మెట్ ధరించాలని పొదిలి సీఐ సుధాకర్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని మేకలవారిపల్లి టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సై పి.ముక్కంటి, తాడివారిపల్లి సిబ్బంది, పాల్గొన్నారు.

పోలీస్ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

మార్కాపురం: పట్టణంలో ఆదివారం జరిగే కానిస్టేబుల్ రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు ఎస్పీ (క్రైమ్)శ్రీధరరావు తెలిపారు. శనివారం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో మొత్తం 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఉదయం 9 గంటలకు అభ్యర్థులు పట్టణంలో తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 10 గంటలు దాటితే లోపలికి ప్రవేశం లేదన్నారు. నేటి నుంచి సాయంత్రం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. జెరాక్స్ సెంటర్‌లను మూసివేయాలని స్పష్టం చేశారు. పరీక్ష హాల్‌లో, బయట ఎవరైన ఓవర్ యాక్షన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ కిషోర్‌కుమార్, సీఐలు భీమానాయక్, మారుతికృష్ణ, ఫిరోజ్, పట్టణ, రూరల్ ఎస్సైలు శశికుమార్, సుమన్, కోటయ్య, వెంకటేశ్వరనాయక్, సైదులు, డివిజన్‌లోని పలువురు ఎస్సైలు, ఏఎస్సైలు, పాల్గొన్నారు.

వైద్యానికి రూ.72 వేల సాయం

బేస్తవారిపేట: అర్థవీడు మండలంలోని చిన్న కందుకూరుకు చెందిన వల్లెల వెంకటరామిరెడ్డి బోన్‌నే రోకు సంబంధించిన వ్యాధితో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. డాక్టర్లు వైద్యానికి రూ.25-30 లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. బేస్తవారిపేటకు చెందిన జై జవాన్ ఫౌండేషన్, కంభంకు చెందిన శ్రీ వేమన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రూ.72 వేలు వసూలు చేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని బాధితుడి తండ్రి సాంబశివారెడ్డికి శనివారం అందజేశారు. బీఎస్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, పూనూరు గురువారెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

పెద్దదోర్నాల: మండలంలో నెలకొన్న నీటి సమస్యను తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ గుమ్మా పద్మజ పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎమ్మార్సీ భవనంలో నిర్వహించారు. ఎంపీడీఓ నాసరరెడ్డి ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. మండల వ్యాప్తంగా నెలకొన్న నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవిని ఎంపీపీ కోరారు. దీంతో పాటు ఉపాధి హామీ, వెలుగు, విద్య, వైద్యం తదితర శాఖలపై ఎంపీపీ గుమ్మా పద్మజ సమీక్ష చేశారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ దుమావత్ లతాబాయి, తహసీల్దార్ వేణుగోపాలరావు, వైస్ ఎంపీపీలు దర్శనం నాగయ్య, పరుచూరి సురేఖ పాల్గొన్నారు.

పాల వెల్లువ విజయానికి కృషి చేయాలి

తాళ్లూరు: జగనన్న పాల వెల్లువ విజయవంతానికి గ్రామ స్థాయిలో పాడుపు సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు, వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు, పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా కో ఆపరేటివ్ శాఖ అధికారి (డీసీఓ) రాజశేఖర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాడుపు సంఘ సభ్యులతో పాటు ఇతర శాఖల అధికారులకు పాల వెల్లువ విజయవంతంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీఓ రాజశేఖర్ మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ పథకం ఏర్పాటుతో పాడి రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. ఎంపీడీఓ కీర్తి, ఏపీడీడీసీఎఫ్ రాజమోహన్, ఏపీఓ దేవరాజ్, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, పశువైద్యాధికారులు ప్రతాప్‌కుమార్, రాంబాబు, డీఈసీ డాక్టర్ భరత్, అమూల్ ప్రతినిధి షేక్ బాజీ మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఉన్న లోపాలు, విజయవంతానికి పాటించాల్సిన విధానాలు సభ దృష్టికి తీసుకురాగా పలు రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దొంగలకు దేహశుద్ధి

మార్కాపురం టౌన్: దొంగతనం చేసేందుకు వచ్చిన ఇద్దరు యువకులను గ్రామస్తులు పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం దరిమడుగులో జరిగింది. పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన జి.అశోక్, అనిల్ కుమార్‌లు మద్యం సేవించి దరిమడుగు గ్రామానికి ఆటో తీసుకువచ్చారు. అప్పటికే ఒక ఇనుప డోర్‌ను దొంగిలించి ఆటోలో పెట్టుకుని మరో చోట వ్యవసాయ పనిముట్లను ఆటోలో పెట్టుకుంటుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. విచారిస్తున్నట్లు రూరల్ ఎస్సై సుమన్ తెలిపారు.

రూ.121 కోట్ల మంజూరుపై ఎమ్మెల్యే హర్షం

దర్శి: నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా కోసం రూ.121 కోట్లు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో విడుదల చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ శనివారం హర్షం వ్యక్తం చేశారు. జీఓ విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులు విడుదలై తాగునీటి ఇబ్బందులు అధిగమించవచ్చని తెలిపారు.

కళ్లంలో మిర్చి చోరీ

పెద్దారవీడు: మండలంలోని సానికవరం కోనక్క చెరువు వద్ద పొలంలో అరబెట్టుకున్న ఎండు మిరప కాయలు శుక్రవారం రాత్రి చోరీ అయ్యాయని రైతు గాలి పాపిరెడ్డి శనివారం తెలిపారు. కళ్లంలో 24 క్వింటాళ్ల ఎండు మిరప కాయలు కోసి ఆరబెట్టుకున్నాడు. కూలీలతో మిరప కాయలు గ్రేడింగ్ చేయడంతో కుప్పలుగా ఏర్పాటు చేసుకున్నాడు. మిరప కాయల్లో కొంత తేమ శాతం ఉందని ఆరబెట్టుకునేందుకు కళ్లం దగ్గరకు వెళ్లి చూడగా కుప్పల్లో అక్కడక్కడా కాయలు తీసిన ఆనవాళ్లు కనిపించాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దొంగలించి ఉంటాడని, వాటి విలువ రూ 2.50 లక్షలు ఉంటుందని, పోలీసుస్టేషనలో ఫిర్యాదు చేసినట్లు రైతు చెప్పాడు.

ఎస్సీ, ఎస్టీ రైతులు పథకాలు వినియోగించుకోవాలి

తాళ్లూరు: ఎస్సీ, ఎస్టీ రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వినియోగించుకోవాలని డీబీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు కోరారు. దారంవారిపాలెంలో శనివారం ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులు సీసీ ఆర్‌సీ కార్డుల పొందితే పలు వడ్డీ రాయితీలతో కూడిన పథకాలు, ఈ-క్రాప్ నమోదుతో వనగూరే ప్రయోజనాలు, వ్యవసాయాభివృద్ధికి చేయాల్సిన కృషిని వక్తలు సభలో వివరించారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు వెంగమ్మ, డీబీఆర్‌సీ ముండ్లమూరు సీబీ గోపనబోయిన వెంకటరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రికార్డుల పరిశీలన

పెద్దారవీడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి శనివారం పరిశీలించారు. గ్రంథాలయ పరిసరాలు, గేటు రిజస్టర్, పుస్తకాలరిజస్టర్, దిన పత్రికలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు దొండపాటి వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యాన్ని మంచి ధరకు అమ్ముకోవాలి

తాళ్లూరు: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వస్తుందని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. మండలంలోని 14 రైతు భరసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే తక్కువగా అమ్ముకోవద్దని అవగాహన కలిస్తూ శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. రైతులు సంబంధిత ఆర్‌బీకేల్లో వీఏఏలను సంప్రదించాలని కోరారు.

పాఠశాల నిర్మాణాల పరిశీలన

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి ఎస్సీ కాలనీల్లో నాడు-నేడు కార్యక్రమం కింద అదనపు తరగతి గదుల నిర్మాణాలను డీఈ రంగారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అదనపు తరగతి గదులు నిర్మిస్తోందని, నాణ్యత లోపం లేకుండా నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. నాడు-నేడు జేఈ చైతన్య, ఈఏ కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

దర్శి: భార్గవి దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీజీఎస్ కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన శిబిరంలో దంత వైద్యులు షరీన్ బాబు,శృతిలు 160 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించి వ్యాధుల లక్షణాలు, చికిత్సపై అవగాహన కల్పించారు. ఎంఈఓ కాకర్ల రఘురామయ్య, సంఘ సేవకులు జీవీ రత్నం, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, విజయ్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా గానాల రామ్మూర్తి జయంతి

యర్రగొండపాలెం: విశ్వకర్మ జాతిపిత, మాజీ ఎమ్మెల్సీ బ్రహ్మశ్రీ గానాల రామ్మూర్తి 131వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ముత్తలూరి మల్లికార్జునచారి మాట్లాడుతూ 1919లో అఖిల భారత విశ్వకర్మ లిబరల్ ఫెడరేషన్ ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా పర్యటించి విశ్వబ్రాహ్మణ స్థితిగతులను అవగాహన చేసుకున్న మహామనిషని రామ్మూర్తి.. అని కొనియాడారు.

హెల్మెట్ తప్పని సరిగా ధరించాలి

దర్శి: మోటార్ సైకిల్ నడిపే వారు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్ట్ తప్పని సరిగా పెట్టుకోవాలని ఎంవీఐ రవికుమార్ సూచించారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం మానవహారంగా ఏర్పడ్డారు.

మార్కాపురం: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అంతా సహకరించాలని మార్కాపురం రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ అమరనాయక్ అన్నారు. శనివారం రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు.

అక్రమ నిర్మాణాలు నిలిపేయాలి

దర్శి: కర్టీస్ మెమోరియల్ చర్చి స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలు నిలిపేసేలా చర్యలు తీసుకోవాలని దర్శి డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డికి సామాజిక ఉద్యమనాయకులు గాలిమూటి దేవప్రసాద్, నవ్యాంధ్ర మాదిగ చర్మ డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కవలకుంట్ల గోవింద్ ప్రసాద్‌లు శనివారం వినతి పత్రం అందజేశారు. చర్చికి ఇవ్వాల్సిన రూ.60 లక్షల నగదు ఇచ్చే వరకు కట్టడాలు నిలిపేయాలని, లేని పక్షంలో నిరాహార దీక్షలు చేస్తామని వారు హెచ్చరించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

గిద్దలూరు రూరల్: మహిళా సాధికారతయే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణ మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నికైన సభ్యులు శనివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన బెల్లం రమాదేవి, గడ్డం రమాదేవి, స్వర్ణకల, సాలమ్మలను ఆయన అభినందించారు. గుల్లా రామక్రిష్ణారెడ్డి, పగడాల వెంకటేశ్వర్లు, శ్రీరాములు, జయరామిరెడ్డి, కౌన్సిలర్లు, గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్, షేక్.మస్తాన్‌వలి, దమ్మాల జనార్దన్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన సమాఖ్య సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. వలంటీర్లపై ఈనాడు, ఈటీవీల్లో వచ్చిన అసత్య కథనాలను ఆయన ఖండిస్తూ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రతి గడప గడపలో వలంటీర్ల సేవలను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. అటువంటి వలంటీర్ల పై అసత్యప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లిన సమయంలో ప్రజలు వారి సేవలను గురించి ప్రశంసిస్తున్నారన్నారు.

తహసీల్దార్ సేవలు మరవలేనివి

నీతికి, నిజాయితీకి మారు పేరుగా పేరు తెచ్చుకున్న తహసీల్దార్ ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ సేవలు మరువలేనివని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చిన సందర్భంగా శనివారం ఆయన నివాస గృహంలో తహసీల్దార్ దంపతులకు ఎమెల్యే సన్మానం చేశారు. డీటీ ప్రసాదరావు, గుల్లా రామక్రిష్ణారెడ్డి, గడ్డం భాస్కర్‌రెడ్డి, పగడాల వెంకటేశ్వర్లు, షేక్.మస్తాన్‌వలి, దమ్మాల జనార్దన్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులన పరిశీలన

పట్టణంలోని శ్రీ పాతాళనాగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం పరిశీలించారు. గర్భాలయంలోని పాతాళనాగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆయన అభివృద్ధి పనుల పనితీరును పరిశీలించారు. సీఆర్ఐ మురళి, గర్రె శ్రీనాథ్, శ్రీకాంత్‌రెడ్డి, శివాపురం ఆంజనేయులు, మోహన్‌రావు, దేవాదాయశాఖ సిబ్బంది జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టజీవుల మనిషి చెంచయ్య

మార్కాపురం టౌన్: కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం తుది శ్వాస వరకు అకుంఠిత దీక్షతో పోరాడిన రావులపల్లి చెంచయ్య సేవలు మరువలేనివని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. చెంచయ్య 16వ వర్థంతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె నాసరయ్య మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ళ క్రితం ప్రభుత్వ ఉద్యోగం వదులుకుని కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ చెంచయ్య ఆశయాలను కొనసాగించాలన్నారు. ఎస్.కె కాశిం, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు కాశీరావు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

దర్శి: పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వెనుక వైపు పేకాడుతున్న నలుగురు జూదరులను శనివారం అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.3870 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారిని దర్శి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచనున్నట్లు తెలపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకులకు మంత్రి పరామర్శ



వెంకట సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి సురేష్

పెద్దారవీడు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలై ఇంట్లో చికిత్స పొందుతున్న ఎస్.కొత్తపల్లె సర్పంచ్ వెన్నా సంజీవరాణి మామ వెంకట సుబ్బారెడ్డి, శివాపురం గ్రామానికి చెందిన డీలర్ మెట్టు భాస్కరరెడ్డి కుమారుడు పవన్ కుమార్‌రెడ్డిలను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, నాయకులు వల్లెల ఈశ్వరరెడ్డి, వి. చెన్నారెడ్డి, వెన్నా శివకృష్ణారెడ్డి, తోకల ఆవులయ్య, ముత్యాలయ్య ఉన్నారు.

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఒంగోలు ఆదిరెడ్డి తండ్రి యోగిరెడ్డి వృద్ధాప్య కారణంతో శుక్రవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదిరెడ్డి ఇంటికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా యోగిరెడ్డి మృతదేహానికి పూలమాలవేసి మంత్రి నివాళులర్పించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి



ప్రశాంతి (ఫైల్)

పుల్లలచెరువు: ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్-17 పోటీల్లో మండలంలోని గిరిజన గూడెం గారపెంట ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం. ప్రశాంతి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమణ తెలిపారు. ఒంగోలులో జరిగిన అథ్లెటిక్స్‌లో భాగంగా 100 మీటర్ల హర్డిల్స్‌లో జిల్లా స్థాయిలో రెండో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. హెచ్ఎం రమణ, వార్డన్ బైస్వామి, పీడీ నరసింహులు, పీఈటీ గౌతమి, గిరిజన గూడెం వాసులు ప్రశాంతిని అభినందించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలి

దర్శి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల జిల్లా కో ఆర్డినేటర్ ఎం. మంజులాదేవి అన్నారు. శనివారం దర్శి కళాశాలను ఆమె సందర్శించారు. హ్యాండ్ బాల్, రెజ్లింగ్, సపక్ తక్రా, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంజులాదేవి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం,శారీరక ధృడత్వాన్ని ఇస్తాయని చెప్పారు. మంచి ప్రవర్తనతో నడుచుకుంటూ పోటీతత్వంతో చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రూత్‌రమోల, వైస్ ప్రిన్స్‌పాల్ మాలకొండారెడ్డి, పీడీ ఆదిశేషు, పీఈటీ సుబ్బారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చేయూత

కురిచేడు: మండలంలోని కల్లూరు-1, కొత్త కల్లూరు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు అవసరమైన బ్యాగ్స్, అభ్యాసన సామగ్రి, వంటకు అవసరమైన కుక్కర్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏపీ ఫిషరీస్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ షేక్ సైదా శనివారం బహూకరించారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రోత్సాహంతో మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు చేయూత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులు మిఠాయిలు పంచారు. అంగన్‌వాడీ టీచర్లు కవిత రాణి, నాగజ్యోతి, మహిళా పోలీస్ శ్రావణి, ఆరోగ్య కార్యకర్త హరిత పాల్గొన్నారు.

గ్రానైట్ లోడు లారీలు సీజ్

కురిచేడు: అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రానైట్ లోడు లారీలను విజిలెన్స్ సీఐ బీవీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా చీమకుర్తి నుంచి ముంబై, గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలకు గ్రానైట్ తరలిపోతోందని ముందస్తు సమాచారంతో సీఐ సుబ్బారావు తన సిబ్బందితో పాటు మైనింగ్, కమర్షియల్ ట్యాక్సు అధికారులతో కలిసి స్థానిక ఎన్‌ఎస్‌పీ కాలువ వద్ద కాపుగాసి శనివారం లారీలను పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ జి.నాగేశ్వరరావు, మైనింగ్ ఏడీ సుధాకర్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

త్రిపురాంతకం: ఆర్టీసీ బస్సును వెనక వైపు మినీ ట్రాలీ ఢీకొనడంతో ఇద్దరు ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని గుట్లపల్లి బస్టాండ్ వద్ద శనివారం జరిగింది. ప్రమాదంలో ఉపాధ్యాయులు విశ్వనాథ్, శ్యాంబాబులు గాయపడ్డారు. వైద్యసేవలు అందించినట్లు ఎస్ఐ జీవీ సైదులు తెలిపారు. వినుకొండ నుంచి వ్యానులో యర్రగొండపాలెం వస్తూ ప్రమాదానికి గురయ్యారు.